మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్

గోల్కొండ: మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు అని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. నానల్‌నగర్ డివిజన్ హకీంపేట్ సనా హోటల్ వద్ద శనివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ సంస్కృతిలో హిందూ, ముస్లింల పండుగలు ఒక భాగమయ్యాయన్నారు. పండుగల్లో అన్ని వర్గాల వారు పాల్గొంటూ ఆనందంగా ఉంటున్నారన్నారు. విందులకే పరిమితం కాకుండా ముస్లింలు రంజాన్ మాసంలో పేద, బడుగు వర్గాల కుటుంబాలకు దాన ధర్మాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్, ప్రముఖ న్యాయవాది మిర్జా ఎక్బాల్ అహ్మద్, సుబేర్ బిన్ అవద్, అజీజ్‌ఖాన్ పటాన్ తదితరులు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

ఘాన్సీబజార్ పార్టీ కార్యాలయంలో..

చార్మినార్: ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని మజ్లిస్ పార్టీ మాజీ కార్పొరేటర్ మహ్మద్ గౌస్ అన్నారు. చార్మినార్–మోతీగల్లీలోని ఘాన్సీబజార్ డివిజన్ పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందన్నారు.


ఇఫ్తార్ విందులో మహ్మద్ గౌస్

వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులను నియమించాలి


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

గోల్కొండ: గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులను నియమించాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ కోరారు. ఈ మేరకు శనివారం ఆయన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి తన బయోడేటాను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్ల నియామకంలో పార్టీలోని సీనియర్లే కాకుండా కోసం పని చేసిన ఇతరులకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని కోరామన్నారు. ఈ విషయంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీనిచ్చారని ఆయన తెలిపారు. ఆయన వెంట ఎం.రఘుపాల్‌రెడ్డి, శ్రీరాములు, పరమానందం, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఇబ్బందుల్లేకుండా చూడాలి


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన అలీ మస్కతి

చార్మినార్: రంజాన్ మాసం సందర్భంగా మక్కా మసీదులో ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేస్తుంటారని వారికి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలని కాంగ్రెస్ ప్రచార, ప్రణాళిక కమిటీ కన్వీనర్ అలీ మస్కతి కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించారు.

ఆశా వర్కర్ల సేవలు వెలకట్టలేనివి

గోల్కొండ: ఆశా వర్కర్ల సేవలు వెలకట్టలేనివని గోల్కొండ ఏరియాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా అన్నారు. ఆసుపత్రిలో ఆశా వర్కర్లు, ఇతర సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆరోగ్య పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, అదేవిధంగా ప్రజల ఆరోగ్యం, గర్భిణుల వివరాలను ప్రభుత్వానికి అందించడంలో అధికారులు, ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉంటారని పేర్కొన్నారు. వీరికి తోడుగా ఏఎస్‌ఎంలు ఉంటూ సలహాలు, సూచనలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ మురళీ, ఆసుపత్రి ఆర్‌ఎంవో డాక్టర్ వినాయకరావు, ఏవో డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

తరావీ ప్రార్థనలతో మానసిక ప్రశాంతత


జాహెద్ ఆలీని సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: తరావీ ప్రార్థనలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రముఖ ముస్లిం మత గురువు జనాబ్ సయ్యద్ హౌలియా హుసేనీ సాబ్ ముర్తుజా బాద్‌షా ఖాద్రీ అన్నారు. గోల్కొండ సాలేనగర్‌లోని రోజ్ ఫంక్షన్‌హాల్‌లో తరావీ ప్రార్థనల ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. దివ్యాంగుడైన కూడా తరావీ ప్రార్థనలు ఆచరిస్తున్న జాహెద్ ఆలీని ఆయన సన్మానించారు. కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు వజీఉజ్‌జమా సిద్ధిఖీ, అజీజ్‌ఖాన్ పఠాన్, హబీబ్ చౌష్ తదితరులు ఉన్నారు.

ఉత్తర భారతీయుల పూజలు



అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గానికి చెందిన ఉత్తర భారతీయ సమాజ్ నాయకులు భబుత్ సింగ్ రాజ్ పురోహిత్, మదన్ సింగ్, గుమాన్ సింగ్, గణపతి సింగ్‌లు పాతబస్తీ భాగ్యలక్ష్మీ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో రాజస్థాన్ ప్రభుత్వ చీఫ్ విప్ జోగేశ్వర్ గార్గ్, ఎమ్మెల్యే భగన్ సింగ్ పాల్గొని పూజలు చేశారు.

బ్రహ్మోత్సవాల్లో సీతారంజిత్‌రెడ్డి..



అబిడ్స్: టీటీడీ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో టీటీడీ సభ్యురాలు సీతా రంజిత్‌రెడ్డి, దళితరత్న అవార్డు గ్రహీత మాణిక్‌రావు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వారికి తీర్థ ప్రసాదాలు అందించారు.

సీఏఏకు ప్రజల మద్దతు

సుల్తాన్‌బజార్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సీఏఏ చట్టాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని బీజేపీ జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో జాంబాగ్‌లో ప్రధాని నరేంద్రమోదీ, అమిత్‌షా చిత్రపటాలకు శనివారం పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశం సుభిక్షంగా ఉండాలంటే మరోసారి నరేంద్రమోదీ ప్రధాని కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, రామకృష్ణ, రాజు యాదవ్, సందీప్, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

మానవజాతికి మహిళ గొప్ప వరం

గన్‌ఫౌండ్రీ: మానవ జాతికి మహిళ ఒక వరమని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక విద్య నియంత్రణ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎ.రామలింగేశ్వర రావు అన్నారు. గన్‌ఫౌండ్రీలో సిద్ధేంద్ర ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మాతృదేవోభవ పేరిట అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టు వేణుగోపాల్, సంస్థ అధ్యక్షురాలు దేవసేనా పాల్గొన్నారు.



మహిళలతోనే సామాజిక అభ్యున్నతి



గన్‌ఫౌండ్రీ : మహిళల అభ్యున్నతితోనే సామాజిక అభ్యున్నతి సాధ్యమవుతుందని పలువురు ప్రముఖులు అన్నారు. రవీంద్రభారతీలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ సాయి అలేఖ్య సాంస్కృతిక సంఘ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ డాక్టర్ శోభారాజ్‌కు జీవిత సాఫల్య పురస్కారం, అదేవిధంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న పలువురు మహిళలకు చాకలి ఐలమ్మ స్త్రీ శక్తి పురస్కారాలను ప్రదానం చేశారు. అనంతరం కేంద్ర మాజీ మంత్రి ఎస్.వేణుగోపాలాచారి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వహించిన చిన్నారుల ఆటపాటలు, నృత్య ప్రదర్శనలు, అన్నమయ్య కీర్తనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్, పర్యాటకశాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, తెలంగాణ బోనాల ఐకాన్ ఎ.శ్యామలాదేవి, సంస్థ వ్యవస్థాపకురాలు ఉపద్రష్ట అరుణ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

20న మహిళా దినోత్సవ వేడుకలు

గన్‌ఫౌండ్రీ : నెల 20వ తేదీన రవీంద్రభారతీలో సీల్‌వెల్ కార్పొరేషన్, ఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు ప్రముఖ గాయని ఆమని శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పద్మశ్రీ ఉమామహేశ్వరీ, కూచిపూడి కళాకారిణి వనజ ఉదయ్‌తో పాటు వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళామణులకు పురస్కారాలు, శోభన్‌బాబు సేవారత్న పురస్కారాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు, దామోదర్‌గుప్తాతో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నారని తెలిపారు.

పారిశుద్ధ్య సమస్యల్లేకుండా చర్యలు

చార్మినార్: పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న అన్నారు. రంజాన్ మాసం నేపథ్యంలో మక్కా మసీదు, చార్మినార్ పరిసరాల్లో సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. అంతేగాకుండా మక్కా మసీదులో జరిగే సామూహిక ప్రార్థనల సందర్భంగా ముస్లింలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

క్రైస్తవులపై పార్టీల వైఖరి తగదు

సంతోష్‌నగర్: దేశవ్యాప్తంగా క్రైస్తవులపై ప్రభుత్వాలు, పార్టీలు అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా అన్ని పార్లమెంట్ స్థానాల్లో నేషనల్ క్రిస్టియన్ బోర్డు తరఫున అభ్యర్థులు పోటీ చేస్తారని నేషనల్ క్రిస్టియన్ బోర్డు జాతీయ అధ్యక్షుడు జాన్ మస్కు అన్నారు. సంతోష్‌నగర్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఒక్కో నియోజకవర్గంలో 100 మంది నామినేషన్లు వేస్తారన్నారు. క్రైస్తవుల ఓటుతో లబ్ధి పొందిన పార్టీలు ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. క్రైస్తవ మైనార్టీ నిధులను వినియోగించుకొని క్రైస్తవులకు రూపాయి కూడా న్యాయం చేయడం లేదన్నారు.

సమాజ సేవే లక్ష్యం



అబిడ్స్: సమాజ సేవకు వాసవీక్లబ్ ఆఫ్ హైదరాబాద్ కృషి చేస్తుందని క్లబ్ అధ్యక్షుడు ఉప్పల వరకుమార్ గుప్తా, మాజీ అధ్యక్షుడు కసువ అనంత నారాయణ, ప్రాజెక్ట్ చైర్మన్ కెవి.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉస్మాన్‌గంజ్ అనాథ ఆశ్రమంలో క్లబ్ తరఫున శనివారం నిత్యావసర వస్తువులు, పిల్లలకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి మంచాల అంబరిషా, కోశాధికారి అడ్డగుల వెంకటేష్, దాత ఎం.సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

జాంబవంతుడి చరిత్రను భావితరాలకు అందించాలి

సుల్తాన్‌బజార్: జాంబవంతుడి చరిత్రను భావితరాలకు తెలియజేసేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ శాఖ ద్వారా చర్యలు చేపట్టాలని మాదిగ రాజ్యాధికార పోరాట సమితి అధ్యక్షుడు తిమ్మన్న నవీన్‌రాజు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో జాంబవంతుడి పెద్ద ఆలయం లేకపోవడం దురదృష్టకరమన్నారు. నెల్లూరులో మరుగునపడిన 1100 ఏళ్ల పురాతన ఆలయాన్ని అభివృద్ధి చేయాలని, అలాగే తెలంగాణలో రెండు ఎకరాల స్థలంలో జాంబవంతుడి ఆలయం నిర్మించాలని కోరారు. ఈ విషయమై ప్రధాని మోదీ బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు వినతి పత్రాలు అందజేస్తామని తెలిపారు. సమావేశంలో సమితి ఉపాధ్యక్షుడు కోటేశ్వర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహా, ప్రవీణ్ జయరామ్ రాజ్, ఎల్లేష్, జగదీశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జిగా పార్టీకి రాజీనామా చేసిన నందకిశోర్ వ్యాస్ బిలాల్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ఆధ్వర్యంలో శనివారం చేరగా ఆమె కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. నందకిశోర్ వ్యాస్ బిలాల్ పార్టీలోకి రావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరినట్లు తెలిపారు. గోషామహల్ నియోజకవర్గంతో పాటు అన్ని ప్రాంతాల్లో తనవంతూ సేవలందిస్తానన్నారు. కార్యక్రమంలో రోహిత్‌రెడ్డి, అరుణ్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


నందకిశోర్ వ్యాస్ బిలాల్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న దీపాదాస్ మున్షీ

రసాయనాలతో మామిడిపండ్ల మక్కి

• ఇద్దరు వ్యాపారుల అరెస్టు • మామిడికాయలు, రసాయన ప్యాకెట్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మామిడికాయలు

సుల్తాన్‌బజార్: రసాయన పద్ధతులతో మామిడి పండ్లను మక్కించి పండ్లను విక్రయిస్తున్న ఇద్దరిని సుల్తాన్‌బజార్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి లక్షల రూపాయాల విలువచేసే మామిడికాయలతో పాటు 15 గ్రాముల ఇథాలియన్ రసాయన పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన శనివారం సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ.మధుసుదన్ తెలిపిన వివరాల ప్రకారం.. మొజంజాహి మార్కెట్ చౌరస్తాలో ఆసిఫ్‌నగర్‌కు చెందిన ఇర్ఫాన్‌ఖాన్ (35) న్యూ లిబర్టీ ఫ్రూట్‌షాప్ నిర్వహిస్తున్నాడు. దారుసలాంకు చెందిన మహ్మద్ హుస్సేన్ (47) లక్కీ ఫ్రూట్‌షాప్ పేరిట వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అయితే వీరు పక్వానికి రాని మామిడి కాయలను తీసుకువచ్చి వాటిని రసాయన పౌడర్ ద్వారా మక్కించి పండ్లుగా మార్చి అక్రమంగా విక్రయిస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్, సుల్తాన్‌బజార్ పోలీసులు ఆయా పండ్ల దుకాణాలపై దాడిచేసి లక్షల విలువైన మామిడి కాయలతో పాటు రసాయన ప్యాకెట్లను పట్టుకొని వారిపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'మూసీ'కి పకడ్బందీ ప్రణాళిక అవసరం

బహదూర్‌పురా: మూసీ నదిని అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే పేదలకు నష్టం జరగకుండా ప్లాన్ తయారు చేయాలని సీపీఐఎం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి ఎండీ అబ్బాస్ నాయకత్వంలో పార్టీ బృందం కిషన్‌బాగ్, అసద్‌బాబానగర్‌లో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎండీ అబ్బాస్ మాట్లాడుతూ.. మూసీ నది అభివృద్ధి చేస్తే 8500 ఇండ్లు కూల్చివేయాల్సి ఉంటుందని గతంలో అధికారులు తెలిపారన్నారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ నివాసముంటున్న వారికి ప్రత్యామ్నాయం చూపాలని కోరారు.

సీపీఎం ఫిర్యాదు

చాంద్రాయణగుట్ట: డబుల్ బెడ్రూం లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించాలంటూ జీహెచ్‌ఎంసీ అధికారుల పేరుతో మోసగాళ్లు ఫోన్లు చేయడం చాంద్రాయణగుట్టలో వెలుగుచూసింది. ఈ విషయాన్ని సీపీఎం జిల్లా నాయకులు కృష్ణా నాయక్, కిషన్, రాంకుమార్ శనివారం జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ అధికారుల వద్ద ఉండే లబ్ధిదారుల జాబితాను తస్కరించిన ఆన్‌లైన్ మోసగాళ్లు కొన్ని రోజులుగా లబ్ధిదారులకు ఫోన్లు చేస్తున్నారన్నారు. ఇప్పటికే కొంతమంది లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో డబ్బులు పంపి మోసపోయారన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అధికారుల తీరుతో ప్రభుత్వానికి చెడ్డపేరు

లంగర్‌హౌస్: కొందరు అధికారుల తీరుతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తున్నదని కార్వాన్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బి–బ్లాక్ అధ్యక్షుడు కె.చంటిబాబు అన్నారు. లంగర్‌హౌస్‌లోని 66 వార్డు కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నా.. ఫిర్యాదు మేరకు నాయకులతో కలిసి శనివారం కార్యాలయానికి వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత సిబ్బంది, అధికారి రావడంతో వారి తీరుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా చంటిబాబు మాట్లాడుతూ.. తామంతా కార్యాలయాల వద్ద ప్రజల సందేహాలు నివృత్తి చేస్తూ దరఖాస్తులు రాసి ఇస్తే అధికారులు అందుబాటులో ఉండడం లేదన్నారు. ఇప్పటికైనా విధులు సక్రమంగా నిర్వర్తించి అర్హులందరికీ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఆయన వెంట నాయకులు శ్రీకాంత్, అలీ, పరమానందం తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న చంటిబాబు


9 గంటల నుండి కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న ప్రజలు

కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం


ప్రభుత్వ సలహాదారు వేమ్ నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న విశ్వకర్మ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సొసైటీ కార్పొరేషన్ లిమిటెడ్‌ను ప్రకటించడంపై విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృసంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు సంఘం ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేమ్ నరేందర్‌రెడ్డిని శనివారం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్ మాట్లాడుతూ.. వివిధ కుల సంఘాలతో ఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం తగదన్నారు. సాంప్రదాయ చేతివృత్తులను అవలంభిస్తున్న విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల సంక్షేమం కోసం ప్రత్యేకంగా సొసైటీని ఏర్పాటు చేయాలన్నారు. వివిధ కుల సంఘాలతో ఏర్పాటు చేసిన కార్పొరేషన్లతో ఎలాంటి ఇబ్బందులు ఉండవని ప్రభుత్వ సలహాదారు స్పష్టం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాల్‌కోట వెంకటచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, ఉపాధ్యక్షుడు భిక్షపతిచారి పాల్గొన్నారు.



గ్లకోమాపై ప్రజలకు అవగాహన

గోల్కొండ: గ్లకోమాపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని మెహిదీపట్నంలోని సరోజినిదేవి కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.రాజలింగం అన్నారు. ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్లకోమా వారోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందితో ఆయన సమావేశమై మాట్లాడారు. గ్లకోమా సైలెంట్ కిల్లర్ లాంటిదని ఎలాంటి లక్షణాలు లేకుండానే కంటి చూపును శాశ్వతంగా దెబ్బతీసే వ్యాధి అని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్‌ఎంవో నజాఫీబేగం, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం



యాకుత్‌పురా: పురానిహవేలీలోని సిటి సివిల్ కోర్టు న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా సిటి సివిల్ కోర్టు చీఫ్ జడ్జి, కోర్టు న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ రేణుకా యారా మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌ను ఆశ్రయించిన వారికి రూపాయి ఖర్చు లేకుండా రాజీ మార్గంలో కేసులను సత్వరమే పరిష్కరించుకోవచ్చన్నారు. 9 బెంచీలను ఏర్పాటు చేసి 578 పెండింగ్ కేసులతో పాటు 3362 ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కరించి బాధితులకు రూ. 51,61,51,208 కోట్ల నష్టపరిహారం అందించాలని సిటి సివిల్ కోర్టు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కళార్చన తెలిపారు. లోక్ అదాలత్‌లో రెండో అదనపు చీఫ్ జడ్జిలు శ్రీనివాస్ రెడ్డి, డానీ రూత్, జడ్జిలు భవానీ, రాధికా, న్యాయవాదులు, ఉద్యోగులు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింట్ శ్రీమతి ప్రతిష్టా రెబాల, W/o ఆదర్శ్ రెడ్డి మూరి, D/o శ్రీనివాసులు రెబాల, సుమారు 39 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం, నివాసము: విల్లా No.44, Sy.No. 142, 143, 149, 150 & 151, కోకాపేట్ గ్రామం, రంగా రెడ్డి జిల్లా, గండిపేట్ మండలం, తెలంగాణ, ఆమె ఒరిజినల్ గిఫ్ట్ డీడ్ డా. నెం. 5344 / 2022 తేది: 25.04.2022, S.R.O. గండిపేట, పాలోమి అరిస్టోస్ నార్సింగి నుండి మెహదీపట్నం, ప్రయాణిస్తుండగా, 14.03.2024వ తేదీన డాక్యుమెంట్ పోయినది మరియు అదే కనుగొనబడలేదు.
ఎవరైనా పత్రాన్ని కనుగొంటే, వారు ఈ నోటీసు తేదీ నుండి 7 రోజులలోపు దిగువ పేర్కొన్న చిరునామాలో నా క్లయింట్‌కు దానిని తిరిగి ఇవ్వవలసిందిగా అభ్యర్థించడమైంది.. నా క్లయింట్ ద్వారా వారికి తగిన రివార్డ్ ఉంటుంది.

ఎస్. వెంకటేశ్వర రావు,
చల్లా ఆది వెంకట రమేష్
న్యాయవాదులు & సహచరులు
F.No. 304, H.No. 6-3-609 / 137 & 145, ఆషియానా అపార్ట్‌మెంట్స్, ఆనంద్ నగర్ కాలనీ, ఖైరతాబాద్, హైదరాబాద్ – 500004,
సెల్ నెం: 9912111249.
తేది: 17.03.2024

ఎమ్మెల్సీ కవిత అరెస్టు అక్రమమంటూ..

• బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల ఆగ్రహం • పార్టీ పిలుపు మేరకు పలుచోట్ల నిరసనలు

బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అరెస్టు చేయడంపై బీఆర్‌ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. పార్టీ పిలుపు మేరకు శనివారం పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల వేళ బీఆర్‌ఎస్‌ను నైతికంగా దెబ్బతీసేందుకే బీజేపీ ఈడీ ద్వారా కవితను అక్రమంగా అరెస్టు చేయించిందని ఆరోపించారు. తెలంగాణ ప్రజలకు అక్రమ అరెస్టులు కొత్త కాదని, ఢిల్లీ మెడలు వంచి తెలంగాణను సాధించుకున్న చరిత్ర తమకు ఉందన్నారు. ఆయా చోట్ల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– జియాగూడ/ చాంద్రాయణగుట్ట/గోల్కొండ


జియాగూడ చౌరస్తాలో కార్వాన్ బీఆర్‌ఎస్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు మంగీ కిశోర్‌కుమార్ తదితరులు



ఎంజే మార్కెట్‌లో..

అబిడ్స్: ఎమ్మెల్సీ కవితను అక్రమంగా అరెస్టు చేశారని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకులు ఆశిష్ కుమార్ యాదవ్ ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఎంజే మార్కెట్ చౌరస్తాలో ఆయన నేతృత్వంలో ఆందోళన చేశారు. ప్రధాని నరేంద్ర మోదీకి, బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజకీయ దురుద్దేశంతోనే బీఆర్‌ఎస్‌పై బీజేపీ కక్షగట్టిందని ఆరోపించారు. అందులో భాగంగానే కవితను అరెస్టు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గోషామహల్ నియోజకవర్గ నాయకులు సునీల్ సాహు, శ్రీనివాస్ యాదవ్ శ్రీనివాస్ గౌడ్, వినోద్ యాదవ్, సంతోష్, రవి, శైలేష్ కుర్మా, దశరథ్, అనిల్, సాయిబాబా, ముకేష్, రాజు, బాబూ సుధాకర్ పాల్గొన్నారు.